క్లుప్తంగా

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు


మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) క్రీడా ప్రాంగణంలో సోమవారం జాతీయ స్థాయి పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు 33 మ్యాచ్‌లను నిర్వహించారు. వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పర్యవేక్షించారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు: మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జువేరియాకు అభినందన



నెల్లూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో నెల్లూరు నవలాకుల గార్డెన్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మహమ్మద్ జువేరియా 594 మార్కులతో సత్తా చాటింది. దీంతో ఆమెను కలెక్టర్ ఆనంద్ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలువడం పట్ల తండ్రి మొహమ్మద్ అబ్దుల్ అజీజ్, తల్లి ఖాజాజమీర్‌కు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి వేదగిరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహకొండలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 6న అంకురార్పణ, 7న చప్పరోత్సవం, ధ్వజారోహణ, రాత్రి శేషవాహన సేవ, ఇలా 16వ తేదీన వరకు వివిధ పూజలు, అభిషేకాలు, అలంకారాలు ఉంటాయి.

కనుపూరు కాలువకు నీటి విడుదల



సంగం: సంగం బ్యారేజ్ నుంచి కనుపూరు కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. కనుపూరు కాలువ చైర్మన్ మస్తాన్‌నాయుడు, డీఈ పాండురంగారెడ్డి కనుపూరు కాలువ రెగ్యులేటర్ వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశువులకు తాగునీరు, నారుమడుల అవసరాలకు 100 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని తెలిపారు. సోమశిల నుంచి నీరు విడుదల చేసిన వెంటనే రెండో పంటకు ఐఏబీ సమావేశంలో కనుపూరు కాలువకు కేటాయించిన మేరకు నీటిని వదులుతామన్నారు. కనుపూరుకాలువ ఏఈ వాసు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బైక్ చోరీకి యత్నం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను పట్టపగలు ఓ వ్యక్తి చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీకి చెందిన పయ్యాం అనే వ్యక్తి మధ్యాహ్నం తన ఇంటి ముందు బైక్‌ను నిలిపి ఇంట్లో ఉన్న సమయంలో ఇనమడుగు సెంటర్‌కు చెందిన రఫీ అనే వ్యక్తి బైక్‌ను చోరీ చేసేందుకు యత్నించారు. వెంటనే స్థానికులు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులకు సోమవారం సమాచారం అందించారు.

‘పల్లెవెలుగు’ ఎక్కడ?

- కనిపించని సర్వీసులు
- ఊర్లకు వెళ్లేందుకు పడిగాపులు
- ఆటోలు నిండితేనే కదిలేది
- భద్రత లేకున్నా వాటిల్లోనే ప్రయాణం


ప్రమాదకర స్థితిలో ఆటోలో ప్రయాణం

పొదలకూరు: ఆర్టీసీ పల్లెవెలుగు పేరుతో కుగ్రామాలకు సైతం బస్సు సర్వీసులను నడిపి ప్రయాణికులకు సేవలందించింది. నేడు ఆ పరిస్థితి లేదు. ఆటోలు అధికం కావడంతో ఆ బస్సులు గ్రామాలకు వెళ్లలేకపోతున్నాయి. ఆటోల కారణంగా ఆదాయం తగ్గిపోవడంతో నష్టాలను భరిస్తూ బస్సు సర్వీసులను నడపలేమని అధికారులు చేతులెస్తున్నారు. అయితే షెడ్యూల్ సర్వీసులను సైతం సక్రమంగా నడపడం లేదని వివిధ గ్రామాల జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడిలా..

మండలంలో నేదురుమల్లి, బత్తులపల్లి, భోగసముద్రం బస్సు సర్వీసులు చాలా ఏళ్లుగా ఉన్నాయి. ఆటోల తాకిడి తట్టుకోలేక మండలంలోని చాలాగ్రామాలకు పల్లెవెలుగు బస్సులను అధికారులు రద్దు చేసినా పైగ్రామాలకు మాత్రం నడుపుతున్నారు. వీటిని నడపడం వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేవు. అయితే ఈ బస్సులను విద్యార్థులు మాత్రమే ఎక్కుతున్నారని అధికారులు అంటున్నారు. ఇటీవల ఒకరోజు నడిస్తే రెండు రోజులు రద్దవుతున్నాయి. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో సర్వీసులను ఆపేస్తున్నారు. మీరు నడపడం లేదు.. మేము ఎక్కడం లేదని ప్రయాణికులు, మీరు ఎక్కడం లేదు.. మేము నడపడం లేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఆర్టీసీకి మద్దతు తెలిపే ప్రయాణికులున్నా సక్రమంగా సర్వీసులను నడపలేకపోతున్నట్లు తెలుస్తోంది.

భద్రత లేకుండా..

పల్లెవెలుగు బస్సులు గ్రామాలకు వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొందరు డ్రైవర్లు ఎక్కువ మందిని ఎక్కించుకోవడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలతో నిత్యం ఒక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లో బంధు వర్గాలున్న డ్రైవర్లు సకాలంలో గమ్యస్థానాలకు చేరుస్తామని, వ్యవసాయ పనులకు వినియోగించే ఎరువుల బస్తాలు, ఇతర వస్తువులను ఇళ్లకు తీసుకొస్తామని జనాన్ని ఎక్కించుకుంటున్నారు. రహదారి నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


పల్లెవెలుగు బస్సు సర్వీసు

నీటి పన్నులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు: నీటి తీరువా పన్ను వంద శాతం వసూలు చేయాలని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నీటి తీరువా పన్ను వసూలు మందకొడిగా ఉందన్నారు. వీఆర్వోలు ప్రత్యేక చొరవ కనబరిచి వసూలు పెంచాలని చెప్పారు. అదేవిధంగా ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి గ్రీవెన్స్ డేలో వీఆర్వో స్థాయి సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీటీ సారంగపాణి, ఆర్ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలేదీ?


ప్రసన్నకుమార్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న నేతలు


సమావేశంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, వీరి చలపతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బూటకపు ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కోవూరు నియోజకవర్గంలో రూ.కోటి నిధులకు సంబంధించిన ఏ ఒక్క పని జరగలేదని తెలిపారు. ఉచిత బస్సు పథకం, తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500 పథకాల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది కాకముందే రూ.1,47,600 కోట్ల అప్పు చేశారని పేర్కొన్నారు. ఇక సంపద సృష్టి ఎలా చేస్తారో ఆయనకే తెలియాలన్నారు. కోవూరు నియోజకవర్గం డ్రగ్స్, ఇసుక, మట్టి దోపిడీ, ఎర్రచందనం తదితర వ్యాపారాలకు అడ్డాగా మారిందన్నారు. కనిగిరి రిజర్వాయర్ నుంచి మొదలయ్యే ఈస్టన్ చానల్‌కు సంబంధించిన పూడికతీత పనుల్లో విడవలూరు, కోవూరు, కొడవలూరు మండలాల్లో వీపీఆర్ ట్రస్ట్ ద్వారా పనులు చేయించామని చెప్పుకున్న టీడీపీ మండల ఇన్‌చార్జులు వాటికి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల బిల్లులు పొందిన విషయం తెలుసుకోవాలన్నారు. దీనిని బట్టి చూస్తే నియోజకవర్గంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ కన్వీనర్లు షాహుల్, చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, అల్లాభక్షు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకు కృతజ్ఞతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇటీవల నియమితులైన వైఎస్సార్‌సీపీ బుచ్చిరెడ్డిపాళెం రూరల్, పట్టణ కమిటీ నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందించారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దేసు విజయకుమార్ - కల్పన దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. రాత్రి అమ్మవారి నగరోత్సవం వేడుకగా సాగింది. దేవస్థానం పాలకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, చైర్మన్ కోట గురుబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, గౌరవ సలహాదారు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, సహాయ కార్యదర్శి మునగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో టెండర్లు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో సీల్డ్‌టెండర్లు, తాత్కాలిక దుకాణాలకు వేలం పాటలను సోమవారం నిర్వహించారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణ, షామియానాలు, బాణసంచా, పుష్పాలంకరణ, జంగిల్ క్లియరెన్స్, రంగులు వేయడం, తదితర వాటికి సీల్డు టెండర్లు నిర్వహించారు. వాటిని తక్కువ కోట్ చేసిన వారు దక్కించుకున్నారు. అలాగే తాత్కాలిక దుకాణాలకు వేలం నిర్వహించగా ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల సురేష్‌బాబు, పచ్చవ కరుణాకర్‌బాబు, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి గణపం రమణారెడ్డి, ఆలయ ఈఓ ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతులు

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బి.శివకృష్ణయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ సమస్యలపై మూడు అర్జీలు అందినట్లు ఆయన వెల్లడించారు. వెంటనే సంబంధిత వీఆర్వోలకు వినతులను అందజేసి పరిష్కరించాల్సిందిగా ఆదేశించానన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

- వృద్ధుడి మృతి

పొదలకూరు: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఉలవరపల్లి గ్రామానికి చెందిన ఎస్.అంకయ్య (74) ఈనెల 3వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందడంతో పొదలకూరు పోలీసులకు సమాచారం అందింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 15 మోటార్‌బైక్‌లు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

కామాక్షితాయి ఆలయంలో వ్యక్తి హల్‌చల్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో సోమవారం ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. భక్తులపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలానికి చెందిన చంద్రబాబు శనివారం రాత్రి కామాక్షితాయి ఆలయానికి వచ్చాడు. అతను వింత ప్రవర్తనతో భక్తులను ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో కుటుంబ సభ్యులు కాళ్లు, చేతులు కట్టేశారు. దీనిపై ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట: ఇందుకూరుపేటలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జనార్దనరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మూడో తరగతిలో 40 సీట్లకు గానూ ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీకి ఒక సీటును కేటాయించినట్లు తెలిపారు. అలాగే నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు ఎస్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 97039 20372 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కిశోరి వికాసం పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు రూరల్ : కిశోరి వికాసం పోస్టర్లను కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన శిక్షణా కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ షాన్‌వాజ్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలి


విద్యార్థినికి సభ్యత్వం అందజేత

కొడవలూరు: గ్రంథాలయ సభ్యత్వం పొందడం ద్వారా మంచి పుస్తకాలను ఇంటికి తీసుకుపోయే వెసులుబాటు ఉంటుందని, తద్వారా పఠనాసక్తి పెంపొందుతుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా పలువురు విద్యార్థులు సోమవారం గ్రంథాలయ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో మెమరీ గేమ్స్ ఆడించడంతో పాటు సృజనాత్మక కృత్యాలు చేయిస్తామన్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంపొందడంతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నేతలు

పొదలకూరు: పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పొదలకూరు తాలూకా స్థాయిలో ఏపీటీఎఫ్ 257 నేతలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ పాఠశాలను కొనసాగించాలన్నారు. ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 6, 7 తరగతులున్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8 తగరతులు ఉన్న చోట ఆరు స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బి.కాంతారావు, అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలపాటు ప్రైవేట్ టీచర్‌గా సేవలందించి అనారోగ్యంతో మృతిచెందిన జ్యోతి మాల్యాద్రికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పొదలకూరు: పట్టణంలోని టైలర్స్ కాలనీ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పొదలకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారును పొదలకూరుకు వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. కారు ముందు భాగం దెబ్బతింది. త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు వెల్లడించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రహదారి భద్రతపై శిక్షణ


మాట్లాడుతున్న సౌత్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్

వెంకటాచలం: మండలంలోని అక్షర విద్యాలయంలో 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు సౌత్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉంటారని తెలియజేశారు. లైసెన్స్, ఆర్సీ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడిపేందుకు అనర్హులని చెప్పారు.

క్యూలైన్లలో దుస్తుల ఆరవేత

- పట్టించుకోని సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో ప్రసిద్ధి చెందిన జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ క్యూలైన్లలో కొందరు దుస్తులు ఆరవేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పవిత్ర కామాక్షితాయి ఆలయంలో ఇలాంటి పనులు ఏంటని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను గుర్తించి నిలువరించాల్సిన ఆలయ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రేపట్నుంచి కాశీవిశ్వనాథుని బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తున్నామన్నారు. గురువారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి శేషవాహనసేవ, శుక్రవారం రాత్రి చంద్రప్రభ, శనివారం రాత్రి రావణసేవ, ఆదివారం ఉదయం గిన్నెభిక్ష, రాత్రి నందిసేవ, సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, మంగళవారం ఉదయం రథోత్సవం, బుధవారం ఉదయం తీర్థవాది, రాత్రి ధ్వజావరోహణ, గజవాహనసేవ తదితరాలు ఉంటాయన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- డీఎంఓ హుస్సేనమ్మ


మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్) : డెంగీ, చికెన్ గున్యా, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో హుస్సేనమ్మ సోమవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో మలాథియాన్ స్ప్రే చేయాలని ఆదేశించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూడటం ద్వారా వ్యాధులను నియంత్రించాలన్నారు. జిల్లాలోని శాశ్వత నీటి గుంతలను గుర్తించి వాటిల్లో దోమలు పెరగకుండా గంబూషియా చేపలను విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేసి దోమలను నివారించేలా వార్డెన్లతో మాట్లాడి చర్యలు చేపట్టాలన్నారు. సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు ఈనెల ఒకటో తేదీన సంతపేట నాలుగుకాళ్ల మండపం వద్ద స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 సాయంతో వృద్ధుడిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై సంతపేట ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.